క్లుప్తంగా

నూతన తహసీల్దార్‌కు సత్కారం



కంచికచర్ల: ఇటీవల కంచికచర్ల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టి విధుల్లో చేరిన శంకరబాబును సోమవారం వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ వేమా సురేష్‌బాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శేషం వాసుబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజా సమస్యలను పరిష్కారం చేయాలని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజల విన్నపాలు విని పరిష్కరించాలని కోరారు. అనంతరం పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గ్రంధి ఆదిత్య పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయంలో మజ్జిగ పంపిణీ



నందిగామ: వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన వారికి దాహార్తి తీర్చాలన్న ఉద్దేశంతో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామని ఆర్డీవో రవీంద్రరావు తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి స్పందన కార్యక్రమానికి వచ్చే వారితోపాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారి దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. సత్య దివ్యాంగుల సేవా సమితి, అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో మెయిన్ బజార్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

స్వాగత ద్వారాల ఏర్పాటుకు స్థల పరిశీలన



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయానికి సంబంధించి మండల పరిధిలోని జాతీయ రహదారిపై ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ వద్ద, చిల్లకల్లు–వైరా రోడ్డు నుంచి ఆలయానికి వచ్చే మార్గంలో మక్కపేట వద్ద శాశ్వత స్వాగత ద్వారాల ఏర్పాటుకు సంబంధించి ఈఓ కె.రమేష్‌నాయుడు, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి సోమవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ జాన్ మోషే మాట్లాడుతూ స్వాగత ద్వారాల ఏర్పాటుకు సంబంధించి అనుమతులు త్వరలో మంజూరు చేస్తామన్నారు. ఈఓ మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ అనుమతులు వచ్చిన వెంటనే దాతల సాయంతో స్వాగత ద్వారాల నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ ఎస్.కృష్ణనాయక్, డీఈ టి.పరశురాముడు, ఏఈ సురేష్, ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు పాల్గొన్నారు.

గుండెపోటుతో వలంటీర్ మృతి



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 8వ వార్డు తొర్రగుంటపాలెం వలంటీర్ ముత్యాల శ్రీదేవి (36) ఆదివారం రాత్రి గుండెపోటుకు గురై ఆకస్మికంగా మృతి చెందింది. గుండె నొప్పిగా ఉందని చెప్పటంతో రాత్రి 9.30 గంటల సమయంలో ఆమెను పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం విజయవాడ తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమారులు, భర్త ముత్యాల జానకీరామయ్య ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మృతురాలి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పలువురు కౌన్సిలర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు చేయడం, అల్లర్లకు తెగబడటం హేయమైన చర్యని విజయవాడ కథోలిక పీఠం ఫాదర్ మువ్వల ప్రసాద్ అన్నారు. స్వాతంత్ర్యం రాక పూర్వం నుంచి భారతదేశ నిర్మాణంలో క్రైస్తవ మిషనరీల పాత్ర కీలకంగా ఉందన్నారు. క్రైస్తవులపై దాడులను నిరసిస్తూ, శాంతి నెలకొల్పాలని కోరుతూ ఏపీ ఫెడరేషన్ ఆఫ్ చర్చిస్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ జరిగింది. సాంబమూర్తిరోడ్డులోని సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి నుంచి ప్రారంభమైన ర్యాలీ అలంకార్ సెంటర్‌కు కొనసాగింది. మణిపూర్‌లో శాంతి నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ర్యాలీలో పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.

విజ్ఞానం, వినోదం మేళవింపు

నందిగామ: విజ్ఞాన భాండాగారాలు విద్యార్థులకు వేసవి సెలవులలో వినోదంతో పాటు విజ్ఞానాన్ని పంచుతున్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో 100 గ్రంథాలయాల్లో 3,465 విద్యార్థులకు ఈ శిబిరాలలో శిక్షణ ఇస్తున్నారు. ఈనెల 8వ తేదీన ప్రారంభమైన ఈ శిబిరాలు జూన్ 11వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ప్రతిరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిబిరాలలో విద్యార్థులకు ఆటపాటలతో పాటు, పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ నాలెడ్జ్, జనరల్ నాలెడ్జ్, తెలుగు పద్యాలు బోధించడంతోపాటు వాటి తాత్పర్యాలు తెలియజేస్తున్నారు.



నందిగామ పట్టణంలోని లైబ్రరీలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో పలు రకాల ఆటలు ఆడుతున్న విద్యార్థులు

ఆటపాటలతో పాటు విజ్ఞానం



వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో ఆటపాటలతో పాటు విజ్ఞానాన్ని పెంచుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. నేను విజయవాడలో ఐదవ తరగతి చదువుతున్నాను. ఇక్కడకు వచ్చి శిక్షణ శిబిరంలో ఎన్నో తెలియనివి నేర్చుకుంటున్నాను. నాకు చాలా సంతోషంగా ఉంది.

– ఎస్.కె నజీమ, నందిగామ

మాకు తెలియని ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నాం



వేసవి శిక్షణ శిబిరంలో నాకు సమయమే తెలియడం లేదు. ఆటపాటలతో పాటు ముఖ్యంగా ఎందరో మహానుభావుల పుస్తకాలను మాతో చదివిస్తున్నారు. దీనివల్ల మాకు తెలియని ఎన్నో విషయాలు నేర్చుకోగలుగుతున్నాము. నాకైతే చాలా సంతోషంగా ఉంది.

– జి.ధనుష్, నందిగామ

విద్యార్థులు మంచి ఆసక్తి చూపుతున్నారు



జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలకు ఈ ఏడాది మంచి ఆదరణ లభిస్తోంది. ముఖ్యంగా నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ శిబిరాలలో విద్యార్థులకు అనేక అంశాల పైన అవగాహన కల్పిస్తున్నాం.

– వి.రవికుమార్, కృష్ణాజిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి

వేసవి విజ్ఞాన శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



కంచికచర్ల గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా నేర్పుతున్న యోగా గురువు నారాయణ



పెనుగంచిప్రోలులో...

కంచికచర్ల: వేసవికాలంలో విద్యార్థులు విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం విద్యార్థులకు పలు విభాగాల్లో ఆటలను నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్ తెలుగు భాషపై విద్యార్థులకు అవగాహన కల్పించటంతో పాటు తెలుగు భాషా పరిజ్ఞానం గురించి వివరించారు. అనంతరం యోగా గురువు నారాయణ విద్యార్థులకు యోగా నేర్పించారు. మంచి ఆరోగ్యం కోసం యోగా ఆసనాలు వేయాలని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ గ్రంథపాలకుడు వెంకటేశ్వరరావు, రచయిత నీలం సర్వేశ్వరరావు, భవిత సెంటర్ ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో విజ్ఞానం

పెనుగంచిప్రోలు: వేసవి శిక్షణ శిబిరాల వల్ల విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని అనిగండ్లపాడు, పెనుగంచిప్రోలు గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబు అన్నారు. వేసవి శిబిరంలో భాగంగా సోమవారం శాఖాగ్రంథాలయాల్లో విద్యార్థులకు కథలు చెప్పించటం, పుస్తకాలు చదివించటంతో పాటు కార్టూన్లు గీయించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.



పేట గ్రంథాలయంలో పద్యాలు, కథల పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు తెలుగు సాహిత్యంపై అవగాహన

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 స్థాయి గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం పలువురు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు వివిధ అంశాలలో శిక్షణ ఇచ్చారు. తెలుగు సాహిత్యంపై అవగాహన కల్పించారు. తొలుత విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయురాలు విద్యార్థులకు తెలుగు పద్యాల పోటీలు, కథల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది శ్యామల, సత్యావతి పాల్గొన్నారు.

ఏపీ జీఈఏ ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష

జగ్గయ్యపేటఅర్బన్:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీ జీఈఏ) జగ్గయ్యపేట తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ జీఈఏ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వివి.సత్యనారాయణ బాబు మాట్లాడుతూ ఏపీ జీఈఏ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 30 వరకు దశలవారీగా ఆందోళన చేపట్టాలని జిల్లా సంఘం ఆదేశాల మేరకు పేట తహసీల్దార్ కార్యాలయం ముందు 50 మందితో రిలే దీక్ష మొదలుపెట్టామన్నారు. తమ సంఘం తీర్మానించిన 160 డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. సంఘ జిల్లా కార్యదర్శి ఎం.జయపాల్, జగ్గయ్యపేట తాలూకా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, కార్యదర్శి బ్రహ్మరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

29 నుంచి దత్తసాయి శివకామేశ్వరీపీఠం వార్షికోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్‌లోని శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠం వార్షిక వేడుకలను ఈనెల 29 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన నిర్వహిస్తున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. 29 న గణపతి పూజ, పుణ్యాహవచనం, గో పూజతో వేడుకలు ప్రారంభమవుతాయని చెప్పారు. అనంతరం లోక కల్యాణార్థం లక్ష్మీగణపతి హోమం, విజయ గణపతి స్వామి వారికి పంచామృత రుద్రాభి షేక అర్చన జరుగుతాయన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమంపై అవగాహన

నందిగామ: మేరా లైఫ్, మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ సూచనల నేపథ్యంలో పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో నందిగామ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ సెంటర్‌లో సోమవారం రాత్రి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ కార్యక్రమానికి సంబంధించి పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవాలు

నందిగామ: పట్టణంలోని కృష్ణబలిజ నగర్‌లో శివ నాగేంద్ర స్వామి వారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. నూతనంగా నిర్మించిన దేవాలయంలో గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, శివ నాగేంద్ర స్వామి, ఆదిశేషువు, నందీశ్వర సమేత శివలింగము, పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠ వేద మంత్రాల నడుమ ఉదయం 8:45 గంటలకు ఘనంగా జరిగింది. ప్రాణ ప్రతిష్ఠ అనంతరం లోక శాంతిని కాంక్షిస్తూ పలు రకాల హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. ప్రతిష్ఠ నేపథ్యంలో పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కృష్ణబలిజ నగర్‌లో సందడి వాతావరణం కనిపించింది.



ఆలయంలో జరుగుతున్న ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కంచికచర్ల స్పందనలో నాలుగు అర్జీలు

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో ప్రజల నుంచి నాలుగు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ శంకరబాబు సోమవారం తెలిపారు. పట్టాదార్ పాసుపుస్తకాలు కావాలని రెండు, కంచికచర్ల పట్టణంలో తాగునీరు సక్రమంగా సరఫరా కావటం లేదని మరో రెండు అర్జీలు వచ్చాయని అన్నారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించి సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.బాలశంకరరావు, వ్యవసాయ అధికారి కె.విజయకుమార్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం కోట భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు



నందిగామ: అర్జీల రూపంలో అందిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ రవీంద్రరావు తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి పలు సమస్యల పరిష్కారం కోరుతూ 5 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డివిజన్ పరిధిలోని ప్రతి మండల కేంద్రాలతో పాటు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.





ఆత్మీయ స్వాగతం

పోర్టు నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మచిలీపట్నం విచ్చేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద ఆయనకు ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆత్మీయ స్వాగతం పలికారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

భక్తులకు మెరుగైన సేవలు

పెనుగంచిప్రోలు: భక్తులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తామని ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు అన్నారు. గ్రామంలో ఉన్న శ్రీ తిరుపతమ్మవారి ఆలయ ధర్మకర్తల సమావేశం సోమవారం చైర్మన్ అధ్యక్షతన ఆయన చాంబర్‌లో నిర్వాహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర అంశాలపై చర్చించటంతో పాటు తీర్మానాలు చేశారు. ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకం ఆదివారం 200, శుక్రవారం 100 మందికి, మిగిలిన రోజుల్లో 75 మందికి ఏర్పాటు చేయాలని తీర్మానించారు. దాతల సహాయంతో పెనుగంచిప్రోలు పోలీస్‌స్టేషన్, శివాపురం, మక్కపేట వద్ద ఆర్చి గేటుల ఏర్పాటుతో పాటు వివిధ రకాల లైసెన్స్ హక్కుల హెచ్చు పాటల ఆమోదానికి తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈఓలు ఉమాపతి, తిరుమలేశ్వరరావు, కొండలరావు, పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేస్తామని ఈఓ కె.రమేష్‌నాయుడు అన్నారు. స్థానిక మునేరు అవతల శ్రీ తిరుపతమ్మవారి అమ్మవారి ఆడిటోరియం స్థలంలో పలు అభివృద్ధి పనులను సోమవారం చైర్మన్ ఇంజం చెన్నకేశవరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడిటోరియం స్థలంలో ఫంక్షన్ హాల్, ఏసీ గదులు, టాయిలెట్ బ్లాక్, వంట షెడ్ల ఏర్పాటుకు సంబంధించి పనులు ప్రారంభించామన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు కోలా రామారావు, కర్ల వెంకటేశ్వర్లు, ఎం.పద్మ, ఆదిమూలం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఈఓ రమేష్‌నాయుడు, చైర్మన్ చెన్నకేశవరావు, పాలకవర్గ సభ్యులు

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల ప్రతిభ

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు):ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ బడుల్లో చదివిన విద్యార్థులకు పదో తరగతిలో అత్యున్నత మార్కులు వచ్చాయని మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో చదివి పదో తరగతి ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన సంగు మానస, జంపాని దుర్గాభవాని, బలుసుపాటి వెంకట్రావమ్మ, నరాల శివకుమార్‌రెడ్డి, ఈమని నందిని, జి.లిఖితలను సోమవారం ఘనంగా సత్కరించారు. వీరిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన వారికి నగదు బహుమతులను పగడాల రవికుమార్, నాల్గో స్థానం సాధించిన వారికి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చటంతో పాటు జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలతో విద్యారంగంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చి ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుత్తా శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు గూడపాటి రవికుమార్, హెచ్‌ఎం సూరిబాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నరాల మధుసూదనరెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానించిన గ్రామ నాయకులు, ఉపాధ్యాయులు

ర్యాపిడో మహిళా రైడర్స్ సర్వీస్ ప్రారంభం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళలు పురుషులకు ఏ మాత్రం తక్కువ కాదని, అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. అలంకార్ సెంటర్ వద్ద ర్యాపిడో బైక్ ట్యాక్సీ సంస్థ ప్రవేశపెట్టిన మహిళా రైడర్స్ సర్వీస్‌ను మేయర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ర్యాపిడో సంస్థ మహిళా రైడర్స్ సర్వీస్‌ను ఏర్పాటు చేసి మహిళా సాధికారత దిశగా అడుగు వేసిందన్నారు. పట్టణాల్లో మహిళల జీవనోపాధికి ఇది దోహదం చేస్తుందని చెప్పారు. మహిళా రైడర్స్ సర్వీస్ అందుబాటులోకి రావడం వలన మహిళల ప్రయాణానికి ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. హాస్పిటల్స్, బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు, ఇతర అత్యవసర పనులపై ఎక్కడికైనా వెళ్లాలంటే ర్యాపిడో మహిళా రైడర్స్ సర్వీసులు వినియోగించుకోవచ్చని చెప్పారు. మహిళా రైడర్స్‌తో రక్షణ ఉంటుందన్నారు. రైడర్స్‌కు కావాల్సిన అన్ని రకాల సదుపాయాలను సంస్థ కల్పించాలన్నారు. మగ వారికి ధీటుగా ర్యాపిడో రైడర్స్ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ర్యాపిడో సంస్థ మేనేజర్, సిబ్బంది, బైక్ రైడర్స్ పాల్గొన్నారు.

